**వారణాసి నాగలక్ష్మి** (స్వప్న మాసపత్రిక ఫిబ్రవరి, 2009)

**ఒక ప్రేమలేఖ:** భార్యాబిడ్డలమీద ప్రేమని మాటల్లో, చేతల్లో చూపడం చేతకాని జనార్దనం- వాళ్ళ భావి సుఖంకోసం- ప్రైవేటు కంపెనీలో ఉద్యోగంతో పాటు చిన్నా చితకా వ్యాపారాలు కూడా చేస్తున్నాడు. ఉదయం వెళ్ళినవాడు రసం పీల్చేసిన చెరకుపిప్పిలా ఐపోయి రాత్రి తొమ్మిదికి ఇల్లు చేరతాడు. స్కూలు టీచరుగా పని చేస్తున్న అతడి భార్య సరోజ ఇంటి పనీ, వంట పనీ, పిల్లల పనీ, భర్త పనీ చేస్తూ- క్షణం తీరిక లేకుండా- మనసుకి ఊరట కలిగించే మంచిమాట కోసం ఎదురుచూస్తూ అది దొరక్క అసంతృప్తితో బాధపడుతూంటుంది. అలాంటి సమయంలో తనొచ్చి నెల రోజులుంటానని అత్తగారు కమలమ్మనించి ఉత్తరమొస్తే- ఆవిడ మడీ తడీఆచారం తల్చుకుని గుండె గుభేల్మంది సరోజకి. తల్లి వస్తోందని మురిసిపోయిన జనార్దనం సరోజ కలవరాన్ని అపార్థం చేసుకుని ఏవగించుకుంటాడు. ఐతే కమలమ్మది ఆధునిక దృక్పథం. ఆమె కోడలికి చేయూతయింది. మనుమణ్ణీ, మనుమరాల్నీ ఆకర్షించి ఆకట్టుకుంది. భార్యపట్ల కొడుకు దృక్పధం మార్చింది. కలకాలం తమవద్దనే ఉండిపొమ్మని అంతా ఆమెని బ్రతిమాలారు. ఐనా తప్పదని తన ఊరు వెళ్ళిపోయిందామె. ఆమె లేని లోటు తమలో రేపిన భావాలకి సరోజ అక్షర రూపమిచ్చి ఉత్తరం వ్రాస్తే- అది అత్తగారికి ప్రేమలేఖలా ఉంది.

**విశ్లేషణ:** 'అమ్మని పువ్వుల్లో పెట్టి చూసుకోవాలి' అన్న భర్తతో- 'రాత్రి పదింటికొచ్చేటప్పుడు గంపెడు పూలు కొని తెండి. రోజంతా ఆ పువ్వుల్లో కూర్చోబెడతా' అన్న భార్య సమాధానంలో- కథాసారాన్నీ, పాత్రచిత్రణనీ ఇమిడ్చిన అసాధారణ ప్రజ్ఞ- మొత్తం కథంతా ఆవరించుకుంది. నేటి కోడళ్ళకి అత్త మంచితనాన్ని అర్థం చేసుకుని ఆమోదించే పరిణతి లేదు. నేటి అత్తలకి కోడళ్ళని అవగాహన చేసుకుని సహకరించే విశాల హృదయం లేదు. గతంలో రచనలో వచ్చిన మా కథ 'అమ్మా ఆలీ- (ఇది తిట్టు కాదు)' కూడా ఇదే అంశాన్ని స్పృశించింది. నేడు కుటుంబవ్యవస్థలో అంతర్లీనమైన బడబాగ్ని అత్తాకోడళ్ళ సమస్య. ఈ కథ ప్రతిఒక్కరూ చదవాలి. అప్పుడు దంపతులమధ్య సామరస్యం ఏర్పాడుతుంది. అత్తాకోడళ్ళు ప్రేమలేఖలు వ్రాసుకుంటారు. అలా జరక్కపోతే లోపం ఉన్నది కథలో కాదు- చదివినవారి సంస్కారంలో. తిరుగులేని సానుకూల దృక్పథాన్ని ప్రతిభావంతంగా, ప్రయోజనాత్మకంగా ప్రదర్శించిన రచయిత్రికి అభినందనలు.